వంద రోజుల్లోనే చేతులెత్తేశారు !

"మేము అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ప్రాధాన్యం.. పేరూరు డ్యాంకు నీరు ఇవ్వడమే. పేరూరుకు నీరందించే పనులు వేగవంతం చేస్తాం. నాలుగు రిజర్వాయర్లు పూర్తి చేసి, నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలన్నదే మా తాపత్రయం. ప్రతి ఎకరాకు సాగు నీరు అందించే ప్రయత్నం చేస్తాం. ఇక్కడ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తారు రోడ్లు వేయిస్తాం. ఎన్ని ఇబ్బందులు వచ్చినా బంగారు గనులు తెరిపిస్తాను. అబద్ధాలు చెప్పం.. అభివృద్ధి చేసి చూపిస్తాం" అని ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత ఓ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. రాష్ట్రం బాగుండాలన్నా.. రాప్తాడు అభివృద్ధి జరగాలన్నా టీడీపీకి ఓటు వేయాలని ప్రచారం చేశారు. తీరా గెలిచాక హామీలు అమలు చేయకుండా ప్రజలకు పంగనామాలు పెట్టారని స్థానికులు మండిపడుతున్నారు.



- అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా హామీలను పట్టించుకోని ఎమ్మెల్యే పరిటాల సునీత
- జాతీయ రహదారి పక్కన పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పి కుచ్చుటోపీ
- జాకీ పరిశ్రమను రప్పిస్తామని చెప్పి పట్టించుకోని వైనం
- రామగిరి బంగారు గనులపై నోరుమెదపని సునీత
- హామీలపై ప్రశ్నిస్తున్న ప్రజలపై దాడులు


కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు, పరిటాల సునీత ఎన్నో హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాప్తాడు నియోజకవర్గం మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారి పక్కన పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తామని చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యే పరిటాల సునీత ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. గతంలో ఏర్పాటు చేయాలనుకున్న జాకీ పరిశ్రమతో పాటు కొత్త పరిశ్రమలు తీసుకొస్తామని చెప్పారు. ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడినా ఒక్క పరిశ్రమ కూడా రాకపోవడంతో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశ చెందుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడుస్తున్నా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చిన పాపాన పోలేదు. హామీలపై ప్రజలు ఎవరైనా ప్రశ్నిస్తే టీడీపీ నాయకులతో దాడులు చేయిస్తున్నారు. దీంతో హామీల గురించి అడిగేందుకు ప్రజలు జంకుతున్నారు.

జీడిపల్లి–పేరూరు డ్యాం కాలువ పనులకు మోక్షమెప్పుడో?

హంద్రీనీవా కాలువ నుంచి రామగిరి మండలంలో ఉన్న పేరూరు డ్యాంకు నేరుగా నీటిని తీసుకెళ్లేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.803 కోట్లు మంజూరయ్యాయి. భూ సేకరణ పనులు కూడా చేపట్టకుండా అప్పట్లో ఈ పనులు ప్రారంభించి వదిలేశారు. తర్వాత 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అదే నిధులతో నియోజకవర్గంలో నాలుగు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాగా తాము తిరిగి అధికారంలోకి వస్తే జీడిపల్లి నుంచి నుంచి పేరూరు డ్యాం వరకు కాలువ పనులు పూర్తి చేయిస్తామని టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసిన పరిటాల సునీత ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. తీరా గెలిచాక ఆ కాలువ పనుల గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు విమర్శిస్తున్నారు. కనీసం కాలువ కోసం భూములు కోల్పోయిన రైతులకు కూడా ఇంత వరకూ పరిహారం ఇప్పించలేదని మండిపడుతున్నారు.



ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆత్మకూరు వద్ద జీడిపల్లి-పేరూరు డ్యాం కాలువను పరిశీలిస్తున్న చంద్రబాబు, పరిటాల సునీత (ఫైల్)



ఆత్మకూరు వద్ద ఆగిపోయిన జీడిపల్లి-పేరూరు డ్యాం కాలువ పనులు

వైఎస్ జగన్ పాలనలో అభివృద్ధి..

ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. వంద రోజులకే ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత కనిపిస్తోంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఉమ్మడిగా ఉన్న రాప్తాడు నియోజకవర్గంలో కూడా అభివృద్ధి కుంటుపడింది. గతంలో ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతంగా ఈ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొంత అభివృద్ధి పనులు జరిగాయి. ముఖ్యంగా ఈ నియోజవర్గంలో ఉన్న పేరూరు డ్యాంకు నాలుగేళ్ల పాటు హంద్రీ-నీవా కాలువ ద్వారా నీరందించి ఈ కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలంగా మార్చేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేసింది.



రాప్తాడును మరింత
అభివృద్ధి చేస్తా..!

ఓ దినపత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఎమ్మెల్యే పరిటాల సునీత

పరిశ్రమలు ఎక్కడ సునీతమ్మా?

44వ జాతీయ రహదారి పక్కన పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత ఎన్నికల ప్రచారం చేశారు. గెలిపిస్తే కొత్త పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. తీరా గెలిచార పరిశ్రమల ఏర్పాటుపై మాట్లాడటం లేదు. నిరుద్యోగులను ఆదుకుంటామని చెప్పి నిండా ముంచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క పరిశ్రమను తీసుకొచ్చిన దాఖలాలు లేవు. ఇప్పుడు హామీలను కప్పిపుచ్చుకునేందుకు మంచి ప్రభుత్వం పేరుతో అభివృద్ధి చేశామంటూ డ్రామాలు ఆడుతున్నారు. పరిటాల సునీతమ్మ పనితీరుపై నియోజకవర్గ ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది.

పరిశ్రమలు వస్తాయా?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాప్తాడు నియోజకవర్గంలో విస్తృతంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కాని నియోజకవర్గంలో ఎక్కడా కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. మాలాంటి యువకులంతా ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎమ్మెల్యే సునీత గెలిచేందుకు అలివికాని హామీలు ఇచ్చారు. గ్రామాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పి.. ప్రజలందరినీ మోసం చేశారు.

– నరసింహులు, శేషంపల్లి, రామగిరి మండలం

సాగునీరు ఎప్పుడిస్తారు?



ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగు నీరు ఇస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత చెప్పారు. ఇప్పుడేమో సాగునీటి ప్రాజెక్టులపై పెదవి విప్పడం లేదు. చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి. ఓట్ల కోసం మీరు ఇచ్చిన హామిలన్నీ నీరుగారిపోతున్నాయి. రోడ్ల గురించి మాట్లాడటం లేదు. ఏదో అన్ని హామీలు నెరవేర్చినట్లుగా మంచి ప్రభుత్వం పేరుతో డబ్బా కొట్టుకుంటున్నారు.

– వరలక్ష్మి, కనగానపల్లి

పరిహారం ఇవ్వరా సునీతమ్మా?



జీడీపల్లి నుంచి పేరూరు డ్యాంకు నీటిని నేరుగా తరలించేందుకు గతంలోనే మా భూములు తీసుకున్నారు. ఇందులో నాకున్న ఏడున్నర ఎకరాల భూమి కాలువకు పోయింది. భూములు కోల్పోయిన రైతులందరికీ ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించి కాలువ పనులు పూర్తి చేయిస్తామని పరిటాల సునీత హామీ ఇచ్చారు. కాని ఇంతవరకూ దాని గురించి మాట్లాడలేదు. మాకు పరిహారం కూడా అందలేదు.

– గోపాల్, రైతు, కొత్తపల్లి, ఆత్మకూరు మండలం

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం శైలజ, ఉపాధ్యాయులు

ధర్మవరం అర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టేబుల్ టెన్నిస్, షూటింగ్‌బాల్ విభాగాల్లో ఇద్దరు విద్యార్థులు ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శైలజ, హిందీ పండిట్ వేణుగోపాల్, పీడీ నాగేంద్ర తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగిన ఎంపికలో టేబుల్ టెన్నిస్ విభాగంలో పవన్‌కుమార్, షూటింగ్ బాల్ విభాగంలో చరణ్‌కుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.

చెన్నేకొత్తపల్లి తహసీల్దార్‌గా సురేష్ కుమార్



చెన్నేకొత్తపల్లి: మండల నూతన తహసీల్దార్‌గా సురేష్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న హమీద్ భాషా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది నూతన తహసీల్దార్‌ను కలసి అభినందనలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ సురేష్ కుమార్ పేర్కొన్నారు.

కంపచెట్ల తొలగింపు



పత్రవాండ్లపల్లి చెరువు కట్టపై కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

నల్లచెరువు: పత్రవాండ్లపల్లి చెరువుకట్టకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను తెలుకున్న నల్లచెరువు మేజర్ పంచాయతీ సర్పంచ్ పంచ రత్నమ్మ శుక్రవారం జేసీబీ సాయంతో కట్టపై ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగింపజేశారు. సమస్యను వెంటనే పరిష్కరించిన సర్పంచ్‌ను పలువురు గ్రామస్తులు, రైతులు అభినందించారు. కార్యక్రమంలో రైతులు ఆదినారాయణ, రాజారెడ్డి, బీరప్ప, గంగులప్ప, గొడ్డు వెలుగుల శ్రీనివాసులు, గువ్వల రమణ, వెంకటరమణ, పాల్గొన్నారు.

బత్తలపల్లి ఎస్సీ కాలనీలో బోరు



ఎస్సీ కాలనీలో బోరు వేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో శుక్రవారం నూతనంగా బోరు వేయడంతో రెండించుల నీరు పడినట్లు ఎంపీడీఓ సాయిమనోహర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి తెలిపారు. గురువారం 'సాక్షి'లో 'తాగునీరు లేక కన్నీరు' శీర్షికన వెలువడిన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఉన్నతాధికారులు గ్రామ పంచాయతీ నిధులు రూ.2.50 లక్షలు వెచ్చించి నూతనంగా బోరు వేయించారు. దాదాపు 300 అడుగులు బోరు వేయగా అందులో రెండించుల నీరు పడడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందాం

కదిరి అర్బన్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందామని వక్తలు పేర్కొన్నారు. కుమ్మరవాండ్లపల్లిలో ఎంపీడీఓ అంజనప్ప ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు సత్కారం చేశారు. లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ రమణకుమార్, డిక్కీ రాయసీమ కోఆర్డినేటర్ కోలా రమణ, కెనరా బ్యాంక్ మేనేజర్ కిరణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకుల ద్వారా సహకరిస్తామన్నారు. ఆర్థికఅక్షరాస్యతా కో ఆర్డినేటర్ వీరమారుతి, పంచాయితీ కార్యదర్శి పద్మజ పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండల ప్రజలు స్వచ్ఛత దిశగా అడుగులు వేయాలని ఎంపీడీఓ సాయిమనోహర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. గ్రీన్ అంబాసిడర్స్‌కు అధికారులతో వివిధ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీలతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ విజయలక్ష్మీ ప్రజలకు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె అధికారులు, సచివాలయ సిబ్బందితో కలసి ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ సచివాలయాల్లో మొక్కలు నాటారు. అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నార్పంపల్లిలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ప్రతి విద్యార్థి పచ్చదనం పరిశుభ్రతను పాటించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎన్‌ఎస్ఎస్ పీఓ గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన విద్యార్థులు, ఎన్‌ఎస్ఎస్ వాలంటీర్లు పచ్చదనం పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపకులు త్రివేణి, కిరణ్‌కుమార్, పావని, భువనేశ్వరి, పుష్పవతి, ఆనంద్, హైమవతి, తాహిర్ అలి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డీపీటీఓ మధుసూదన్ ఆదేశాల మేరకు కార్యాలయ సిబ్బంది శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు.

చెన్నేకొత్తపల్లి: పరిసరాల శుభ్రతతో రోగాలకు దూరంగా ఉండవచ్చని వైద్య సిబ్బంది తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఎర్రోనిపల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గంగినేపల్లి సబ్ సెంటర్ సిబ్బంది గ్రామంలోని రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చెత్తా చెదారం, తడి ఉన్న ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమకాటుకు గురికాకుండా రాత్రి సమయంలో వేపాకు పొగ వేసుకోవాలన్నారు. లేకపోతే దోమతెరలు వాడాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకట నారాయణ, సీహెచ్‌ఓ ఐశ్వర్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు కృష్ణమ్మ, రాజేశ్వరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడాపోటీలు



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగంలో మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడాపోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీలు నల్లప్ప, అంజన్న, కుమార రాజు, సుధాకర్, విజయ నిర్మల, కొండమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు శుక్రవారం రసవత్తరంగా సాగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, చెస్, యోగా పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటాచలం, శంకర్‌నాయక్, యశోదమ్మ సుజాత తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్ట్

కదిరి టౌన్: మహిళను ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. ఖాజానగర్‌కు చెందిన ఎస్.హసీనా(45) ఈనెల 17న సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్య చేసుకుంది. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలు.. హసీనా కుతురు షహీనాను ఖాజానగర్‌లో నివాసం ఉన్న ఖాతిబ్ షేక్ ఇర్ఫాన్ పెళ్లి చేసుకుంటానని చెప్పి ఇంటి నుంచి పిలుచుకెళ్లాడు. ఈ విషయంలో హసీనా ఇర్ఫాన్‌తో గొడవపడింది. ఈక్రమంలో హసీనాను తిట్టి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించాడు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు

'కావాలనే కక్ష సాధింపు చర్యలు'

కదిరి టౌన్: ఎన్నికల్లో తాము వైఎస్సార్‌సీపీకి పని చేశామనే నెపంతో కావాలనే తమపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని శివసాయి కన్‌స్ట్రక్షన్ అధినేత ప్రణీత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుటాగుళ్ల పొలం 908-1,2, 913-1,2,449 సర్వే నంబర్లు 3.843 ఎకరాల భూమిలో మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకుని 15 ఏళ్లుగా క్వారీ, క్రషింగ్ యూనిట్ నడుపుతున్నామన్నారు. అధికారులు తమకు కుటాగుళ్ల రైల్వేగేట్ ఎడమ వైపున ఉన్న రోడ్డు గుండా వెళ్లడానికి అనుమతిచ్చారన్నారు. అయితే ఆ రోడ్డు గుండా తమ వాహనాలు వెళ్లకుండా చేయడానికి మున్సిపల్ అధికారులు రోడ్డుకు పెద్ద ఇనుప స్తంభాలు నాటారన్నారు. దీంతో సైదాపురం గ్రామస్తులు, రైతులు కూడా ఇబ్బంది పడతారన్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రేపు సైక్లింగ్

ధర్మవరం అర్బన్ : పట్టణంలో ఆదివారం తలపెట్టిన సైక్లింగ్‌లో పట్టణవాసులు పాల్గొనాలని ధర్మవరం సైక్లింగ్ అండ్ వాకర్స్‌క్లబ్ సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు గోరకాటి పెద్దారెడ్డి శుక్రవారం కోరారు. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎర్రగుంట సర్కిల్ వరకు తిరిగి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంటుంటుందన్నారు. వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిశోర్‌రెడ్డి, బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంప్రసాద్, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శైలజ హాజరుకానున్నారని తెలిపారు. సైక్లింగ్ అనంతరం పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందించనున్నామని వివరించారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ధర్మవరం: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జెవీ రమణ, కోకన్వీనర్ అయుబ్‌ఖాన్ కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు దాదాపు 6 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

చెన్నేకొత్తపల్లి: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆదిశక్తి సొసైటీ సీఈఓ కవిత సూచించారు. మండల పరిధిలోని గొల్లవాండ్లపల్లిలో శుక్రవారం ఉచిత శాంతిరాజీ కేంద్రం వారు మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. గృహహింస, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను నాటకం ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఆదిశక్తి సొసైటీ అధ్యక్షురాలు అశ్వర్థమ్మ, ప్రోగాం కో-ఆర్డినేటర్ గౌరి, అసోసియేట్ పావని, రామగిరి మహిళా శక్తి సీఈఓ కాంచన, కొత్తచెరువు, పుట్టపర్తి సీఈఓ జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

ఇంటింటికి కరపత్రాల పంపిణీ

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలో శుక్రవారం ఎంపీడీఓ అంజనప్ప ఆధ్వర్యంలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కరపత్రాల పంపిణీ చేశారు. మండల స్పెషలాఫీసర్ సుబ్బారావు వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యదర్శి పద్మజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి మోహన్‌రామ్, ఎంపీడీఓ నామానాయక్, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తలుపుకు స్టిక్కర్‌లు అంటించి కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన పాలనపై తెలియజేశారు.

ఘర్షణలో మహిళకు గాయాలు

తలుపుల : రాజనాలవాండ్లపల్లిలో గోడ విషయమై ఇరు కుటుంబాలు ఘర్షణ పడగా ఓ మహిళకు గాయాలయ్యాయి. వివరాలు..శుక్రవారం ఉదయం గోపాల్, రెడ్డెప్ప కుటుంబాలు గోడ విషయమై గొడవకు దిగారు. గోపాల్ భార్య అంజినమ్మను రెడ్డెప్ప, అతడి తల్లి,భార్య కమలమ్మ, వనజమ్మ కలిసి దాడి చేసి గాయ పరిచారు. బాధితురాలిని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ గురప్ప తెలిపారు.

26 వరకు 'ఇది మంచి ప్రభుత్వం

కదిరి: పట్టణంలోని వార్డు సచివాలయాల పరిధిలో ఈనెల 26 వరకూ 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 100 రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ముదిగుబ్బ: ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామరావు తోపుడు బండ్ల వ్యాపారులకు సూచించారు. శుక్రవారం ముదిగుబ్బ మార్కెట్ నేపథ్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తోపుడుబండ్లతోపాటు ఆటోలను రోడ్డుపై పెట్టొద్దని సీఐ తెలియజేశారు.

సంక్షిప్త సమాచారం

మురుగు నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోండి

చెన్నేకొత్తపల్లి: ప్రజలు తమ నివాస ప్రాంతాల చుట్టూ వర్షపు, మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. శుక్రవారం న్యామద్దెల సచివాలయం-2 పరిధిలో ఎన్‌ఎస్ గేట్ పీహెచ్‌సీ సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి డ్రమ్ములు, నీటి తొట్టెల్లో నిల్వ చేసిన నీటిని పరిశీలించారు. దోమల లార్వా ఉన్న వాటిని పారబోశారు. అలాగే మురుగు నీరు నిలిచిన ప్రాంతం, డ్రైనేజీల్లో అబెట్ మందు పిచికారీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి

కదిరి టౌన్: ఆత్మహత్యకు యత్నించిన ఆర్టీసీ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.. పట్టణంలోని వాణీవీధికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ బి.రమణ(42) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురై గురువారం ఊజీ మాత్రలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిటన్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నల్లచెరువు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ గంగరత్నమ్మ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ అధికారులు పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. నల్లచెరువు మేజర్ పంచాయతీ సర్పంచ్ పంచ రత్నమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీఓ కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేసి వాటి ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ సూచించారు. ఏపీఎం రవీంద్ర, సూపర్‌వైజర్లు రఫి మున్నీషా, పద్మావతి, లక్ష్మీదేవి, జయమ్మ పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

ఎన్పీకుంట: దిగువగూటిబైలు గ్రామంలో హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని బీజేపీ నాయకుడు జయరాములు అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తహసీల్దార్ సరేంద్ర కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మనోహర్‌కు వినతి పత్రం అందించారు.

రేపు కంటి శస్త్రచికిత్సశిబిరం

ధర్మవరం అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి శస్త్రచికిత్స శిబిరం నిర్వహించనున్నామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

24న కౌన్సిల్ సమావేశం

కదిరి: మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 24న సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, కమిషనర్ కిరణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులతో పాటు అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో కుబేర లక్ష్మీవ్రతం



కుబేర లక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు

ముదిగుబ్బ: స్థానిక గణేష్ హరిహర ఆలయంలో ఏడు శనివారాల వ్రతంలో భాగంగా శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో కుబేర లక్ష్మీవ్రతం చేశారు. పూజారి రఘునాథశాస్త్రి ఆధ్వర్యంలో మహిళలు వ్రతాన్ని ఆచరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నగదు బహుమతుల ప్రదానం

నల్లమాడ: స్థానిక జెడ్పీహైస్కూల్‌లో టెన్త్‌లో ప్రతిభచాటిన విద్యార్థులకు శుక్రవారం నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి కింద ఎస్.సందీప్ అనే విద్యార్థికి రొద్దం నారాయణరెడ్డి మెమోరియల్ ట్రస్టు తరఫున రూ,10 వేలు, రెండో బహుమతిగా జ్యోతికి సోమగుట్ట యంగారెడ్డి మెమోరియల్ ట్రస్టు తరఫున రూ.6 వేలు, మూడో బహుమతి ఇ. నరేష్‌కు పఠాన్ జబ్బార్ ఖాన్ మెమోరియల్ ట్రస్టు తరఫున రూ.5 వేలు, నాలుగో బహుమతి కింద సీ. చరణ్‌కు చదివే వెంకటనారాయణ తరఫున రూ.3 వేలను అందజేశారు. హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ సురేష్‌బాబు, 1991-92 పూర్వ విద్యార్థులు ఎన్‌ఈ రామాంజనేయులు, సుధాకర్‌రెడ్డి, సలాంఖాన్, చంద్రహాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వీరశేఖర, శంకర్‌నారాయణ, శివారెడ్డి, ఉత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.